

రేపు తుంగభద్ర సలహా కమిటీ సమావేశం

బళ్లారి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని వికాస్ సౌధలో తుంగభద్ర నీటి పారుల సలహా సమితి సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు కర్ణాటక తుంగభద్ర బోర్డు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఐఏబీ చైర్మన్, కొప్పళ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శివరాజ్ తంగడిగే అధ్యక్షతన వహించనున్నారు. ప్రస్తుతం డ్యాంలో ఉండే నీరు, రబీకి విడుదల చేయనున్న జలాలు, తాగునీరు, ఇతర అవసరాలకు వాడే నీరు తదితర అంశాలపై చర్చించి, పంపకాలు కేటాయించనున్నట్లు వారు తెలిపారు.



బెంగళూరు టెక్ సమ్మిట్‌ను ప్రారంభిస్తున్న సీఎం సిద్ధరామయ్య

సాంకేతిక ప్రగతికి వేదిక

- బెంగళూరు టెక్ సమ్మిట్‌తో వినూత్న ఆవిష్కరణలు
- ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య
- 40దేశాల భాగస్వామ్యం
- సదస్సుకు దేశంలోని ఐటీ, బీటీ దిగ్గజాలు
- ఆకట్టుకున్న ప్రదర్శనలు



రోబో నమూనాతో సెల్ఫీ తీసుకుంటున్న యువతి





గండభేరుండ పక్షి నమూనా

← రెక్కల రోబో

బెంగళూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆధునికత, సాంకేతిక ప్రగతికి బెంగళూరు టెక్ సమ్మిట్ వేదిక అయ్యిందని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. బెంగళూరు టెక్ సమ్మిట్ (బీటీఎస్) 27వ ఎడిషన్‌ను ప్యాలెస్ మైదానంలో మంగళవారం సీఎం లాంఛనంగా ప్రారంభించారు. 40దేశాలకు చెందిన ఆర్థిక, సాంకేతిక, ఐటీ, బీటీ, సైన్స్ రంగాల మంత్రులు, సీఈఓలు భాగస్వామ్యులయ్యారు. సమ్మిట్‌ను ఉద్దేశించి సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ భారత సాంకేతిక పరివర్తనలో ముందంజలో కర్ణాటక ఉండడం గర్వకారణంగా ఉందన్నారు. 20వ శతాబ్దం ప్రారంభంలో బెంగళూరు నగరం ఏరోస్పేస్ డిఫెన్స్ ఉత్పత్తులకు కేంద్రంగా అభివృద్ధి చెందిందన్నారు. 2000 సంవత్సరంలో అప్పటి సీఎం ఎస్ఎం కృష్ణ దూరదృష్టితో ఎలక్ట్రానిక్ సిటీ, ఐటీ పార్క్‌లను ప్రారంభించడం ద్వారా బెంగళూరు మార్పు తెచ్చారన్నారు. అంతర్జాతీయస్థాయి టెక్ అనే గుర్తింపు వచ్చేందుకు అప్పుడు వేసిన పునాదులే కారణమన్నారు. సాఫ్ట్‌వేర్, బయోటెక్నాలజీ, అభివృద్ధి చెందిన ఉత్పాదనలో తన ప్రభావాన్ని బెంగళూరు అంతర్జాతీయస్థాయిలో రాణిస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంతవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా పేరొందిందన్నారు. ఐటీ, డీప్‌టెక్, బయో టెక్నాలజీ, నానో సైన్స్ ప్రగతితో పాటు స్టార్టప్‌లకు కేంద్రంగా విరాజిల్లుతోందన్నారు. ఈ పరంపర ఆధారంగా ఆధునికత, సుస్థిరతకు అనుబంధంగా అభివృద్ధికి తామంతా కట్టుబడి ఉన్నామన్నారు. దేశంలో తొలి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ పాలసీని కర్ణాటక అమలులోకి తెచ్చిందన్నారు. ఈకేంద్రాలకు అవసరమైన సౌలభ్యాలకు, ప్రోత్సహించడం ద్వారా బెంగళూరు, మైసూరు, బెళగావి ప్రాంతాలను గ్లోబల్ టెక్నికల్ జిల్లాలుగా తీరుస్తున్నామన్నారు. రాష్ట్రంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌లను స్థాపించేందుకు ఈ పార్కులు కేటాయించామన్నారు. బెంగళూరు ఆధునికతతో జ్ఞానం, ఆరోగ్య రంగంలో అభివృద్ధి కోసం దేవనహళ్ళి ఎయిర్‌పోర్ట్ నుంచి 45 నిమిషాల ప్రయాణ దూరంలో క్విన్‌సిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఆధునిక పరిశోధనలకు ఇది అంతర్జాతీయ కేంద్రం కానుందన్నారు. ఏఐ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సహిస్తామన్నారు. బెంగళూరులో ఫిన్‌టెక్ లీడర్‌షిప్ నుంచి హుబ్బళ్ళి-ధారవాడలో ఎలక్ట్రికల్ వెహికల్స్ ప్రగతి, డ్రోన్‌లు, మైసూరులో పీసీబీ క్లస్టర్ ఆధారిత అనుసంధానం సమతుల్యత, ప్రాదేశిక ప్రగతి సాధించనున్నామన్నారు. బెంగళూరుపై దృష్టి కేంద్రీకరిస్తూనే ప్రాంతాలవారీగా పరిశ్రమల పెంపు, పెట్టుబడుల ఆకర్షణకు తగిన పాలసీలను, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. టెక్ ఆధారిత సెక్టార్‌లను ఉత్తేజం కల్పించేందుకు భౌతిక, డిజిటల్ మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానం కోసం 'నమ్మ గ్రామ నమ్మ యోజనె' తీసుకొచ్చామన్నారు. బియాండ్ బెంగళూరు కార్యక్రమాలను అభివృద్ధి చేయదలిచామన్నారు. 2022 నుంచి ఏడాదికే 18.2శాతం ప్రగతి స్టార్టప్‌ల ద్వారా సాధ్యమైందన్నారు. 3,036 స్టార్టప్‌లు కల్గిన కర్ణాటక దేశంలోనే 8.7శాతం ప్రగతితో ఉందన్నారు. కోచనహళ్లిలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చర్ క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నామని, ఇది అంతర్జాతీయస్థాయి సెమీ కండక్టర్ పరిశ్రమల్లో కీలకం కానుందన్నారు. ఆధునికత సహభాగత్వంతో అభివృద్ధి ప్రయాణంలో కర్ణాటకకు వచ్చే పారిశ్రామికవేత్తలందరికీ సంపూర్ణంగా సహకరిస్తామన్నారు. మార్పుకోసం కలసి ముందుకెళ్దామన్నారు. ఇదే సమావేశంలో డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ కర్ణాటక దేశంలోని టెక్నాలజీ రంగానికి హృదయం లాంటిదన్నారు. బయో టెక్నాలజీలో 52శాతం ఉద్యోగాలు సాధ్యమవుతున్నాయన్నారు. బెంగళూరు అభివృద్ధికి నెహ్రూ దూరదృష్టి కారణమన్నారు. విప్రో అజీం ప్రేమ్‌జీ, ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, బయోటెక్ కిరణ్‌మజుందార్‌షా వంటివారి ఆలోచనలు నగరాన్ని అంతర్జాతీయస్థాయికి చేర్చాయన్నారు. యానిమేషన్ రంగంలో 25వేలమందికి శిక్షణలు ఇస్తామన్నారు. బెంగళూరు అభివృద్ధి జరిగేదాకా విశ్రమించేది లేదన్నారు. కార్యక్రమంలో ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంక ఖర్గే, కియోనెక్స్ చైర్మన్ శరత్‌బచ్చేగౌడ ముఖ్యులుగా పాల్గొన్నారు. వివిధ దేశాల ప్రతినిధులతో చర్చాగోష్టులు జరిగాయి. ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్, ఐటీబీటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏక్‌రూప్‌కౌర్ ముఖ్యులుగా పాల్గొన్నారు. స్విగ్గీ కో-ఫౌండర్ శ్రీహర్ష మాజేటి, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా ఎండీ సంతోష్‌కుమార్‌ను సత్కరించారు.

వ్యర్థాలతో వినూత్న నమూనాలు

టెక్ సమ్మిట్‌ను విభిన్నమైన రీతిలో ఏర్పాటు చేశారు. సీఎంతోపాటు ప్రముఖులను జెట్‌సూట్ డిజైన్‌తో బీటీఎస్ ఫ్లైయింగ్‌మ్యాన్ వినూత్నంగా ఆహ్వానించారు. వేదికతోపాటు పలు చోట్ల ప్రభుత్వలాంఛన గండబేరుండ పక్షి, ఇతర నమూనాలను రూపొందించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో సిద్ధం చేశారు. తొలిరోజున వేలాదిమంది సందర్శకులు తరలివచ్చారు. నగరంలోని పలువురు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు. వినూత్న నమూనాలతో సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. దేశ విదేశాలకు చెందిన కంపెనీల 700 స్టాల్స్ ఏర్పాటు చేశారు. బెంగళూరుతోపాటు రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల స్టాల్స్ ఆకర్షణీయంగా ఉన్నాయి. డీఆర్‌డీఓ స్టాల్‌ను తిలకించేందుకు సందర్శకులు ఉత్సాహం చూపారు.



వివిధ దేశాల ప్రతినిధులు



జెట్‌సూట్ డిజైన్‌తో బీటీఎస్ ఫ్లైయింగ్‌మ్యాన్ ఆహ్వానం

సాహిత్య సభలో మంత్రి ఎదుటే వివాదం



సాహిత్యసమ్మేళన సన్నాహక సభలో మంత్రి చలువరాయస్వామి

బెంగళూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండ్యలో జరిగే అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం సన్నాహక సభలో మంత్రి సమక్షంలోనే వివాదం నెలకొంది. మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చలువరాయస్వామి అధ్యక్షతన సోమవారం జరిగిన సభకు కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మహేశ్‌జోషి కన్నడ సాహితీవేత్త జయప్రకాశ్‌గౌడల మధ్య వాగ్వాదం జరిగింది. సాహిత్య పరిషత్ అధ్యక్షులు మహేశ్‌జోషి మాట్లాడుతూ ఒకప్పుడు సాహిత్య పరిషత్ అధ్యక్షుడి నివాసానికి కారు పంపి ముఖ్యమంత్రులు రప్పించుకునేవారని, ప్రస్తుతం సీఎంతోపాటు మంత్రుల ఇళ్లకు వెళ్లి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. ఇందుకు సాహితీవేత్తలు పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే సమయంలోనే ప్రొఫెసర్ జయప్రకాశ్‌గౌడ నేరుగా మహేశ్‌జోషి వద్దకు వెళ్లి మైక్ లాగేసే ప్రయత్నం చేశారు. దీంతో మంత్రి జోక్యం చేసుకుని ఆయన అభిప్రాయానికి తెలపరాదని, ఆ తర్వాత మీరు కూడా ప్రసంగించవచ్చునన్నారు. అనంతరం జయప్రకాశ్‌గౌడ మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య మనవరాలి పేరును ప్రస్తావించారని మండ్యలో సాహితీవేత్తల వారసులు లేరా..? అంటూ ప్రశ్నించారు. పరిషత్ అధ్యక్ష పదవి రాజ్యాంగబద్ధం కాదని, అదో సాహిత్య అభిలాష కల్గినవారికి గౌరవమన్నారు. గతంలో అధ్యక్షులుగా ఉన్న మద్దూరు దేశహళ్ళి నారాయణ తరహాలో ఉండాలన్నారు. అధ్యక్షుడికి విలువ ఇవ్వాలని, అందరూ నా వద్దకు రావాలనే ధోరణి సరికాదన్నారు. సమ్మేళనంలో ప్రచురితమయ్యే 87 పుస్తకాల వెనుక రచయితల పరిచయం ఉండాలని, పరిషత్ అధ్యక్షుడి పరిచయం ఫోటో సరికాదన్నారు. సమ్మేళనం ఫ్లెక్సీలు, బోర్డులలో సాహితీవేత్తలు, సమ్మేళనం అధ్యక్షుల ఫోటో మినహా మరొకరిది ఏర్పాటు చేయరాదన్నారు. సమ్మేళనానికి లక్షలాదిమందిని జోషి తీసుకొస్తారనే నా వ్యాఖ్యలపై పరువునష్టం వేయడం సమంజసమా..? అంటూ సాహితీవేత్త జీటీ వీరప్ప ప్రశ్నించారు. ఆయనకు రిటైర్డు అధ్యాపకుడు శంకరగౌడ మద్దతు ఇచ్చారు.

వక్కతో కేన్సర్ ప్రమాదం..!

- రైతులపై ఐఏఆర్‌సీ నివేదిక కత్తి
- అంగీకరించేది లేదంటున్న అన్నదాత
- వక్క అనాదిగా భారతీయ సంస్కృతిలో భాగం
- పొగాకుతో కలిపి పరిశీలనపై అభ్యంతరం

బెంగళూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యధికంగా వక్క సాగు జరిగేది రాష్ట్రంలోనే. లక్షలాదిమంది రైతులు తరతరాలుగా వక్కపంటను వాణిజ్యపరంగా సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే వక్క వాడకంతో కేన్సర్ ప్రభావం సోకనుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) అనుబంధ సంస్థలైన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ అండ్ కేన్సర్ (ఐఏఆర్‌సీ) ఈనెల 9న నివేదిక విడుదల చేసింది. అంతర్జాతీయ మ్యాగజైన్‌లలో దీనిని ప్రముఖంగా ప్రచురించారు. ఐఏఆర్‌సీ కేన్సర్‌పై పరిశోధన చేసే ఓ సంస్థ. ఐదేళ్లకోసారి నివేదికను విడుదల చేస్తారు. ఈ సంస్థ గతంలో విడుదల చేసిన నివేదికలను వక్కలో కేన్సర్ కారకం ఉందని ప్రస్తావించింది. తాజాగా వక్కతో కలిపి పొగాకును తినే విధానాన్ని నియంత్రిస్తే ప్రపంచంలో మూడింట ఒక వంతు నోటికేన్సర్‌ను నియంత్రించవచ్చని నివేదికలో పేర్కొంది. అయితే పొగాకుతో పాటు వక్క పంటను నియంత్రించే పరిస్థితి తప్పదేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం దేశవ్యాప్తంగా ఎటువంటి పరిణామం చూపిందోకానీ పది జిల్లాల రైతుల మెడపై కత్తి తూగినట్లుగా అయ్యింది.

దేశంలో దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్‌ల్లో ప్రముఖ వాణిజ్యపంటగా వక్కను సాగు చేస్తారు. రాష్ట్రంలో వక్క సాగు చేసే రైతులు, వ్యాపారుల సంఘాలు తీవ్రంగా అభ్యంతరం తెలిపాయి. క్యాంప్కో, తుమ్కోంతోపాటు వక్క విక్రయ సంఘా ల కూటములు రాష్ట్రంలోని అన్ని వక్క సహకార సంఘాలు నివేదికను తాము అంగీకరించేది లేదని అంటున్నాయి. ఐఏఆర్‌సీ నివేదిక పొగాకుతో మిశ్రమం చేసిన వక్కను కలిపే ప్రస్తావించారని అభ్యంతరం వ్యక్తం చేశా రు. పొగాకు ఏ విధంగా వాడినా కేన్సర్ ప్రభావమని ఎన్నో పరిశోధనలు తేల్చాయన్నారు. రాష్ట్రంలోని నిట్టి యూనివర్సిటీతోపాటు పలు అధ్యయనాలు తేల్చాయని, ఆయుర్వేదం కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసిందన్నారు.

వక్క ద్వారా కేన్సర్ ప్రభావం అనే అంశంపై సుప్రీంకోర్టులో కొన్నేళ్లుగా కేసు నడుస్తోంది. కేంద్రప్రభుత్వం రూ.10కోట్లతో ఓ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ముందు వక్కతో కేన్సర్ కారకం కాదని, దేశంలోని ఉద్యానవన విశ్వవిద్యాలయాలు నివేదికలు సమర్పించాయి. వక్క సహకార సంఘాలు కూడా ఇదే అభిప్రాయాలను వ్యక్తం చేశాయి. దశాబ్దాల కాలంగా వక్క కేన్సర్ కారకమని, నివేదికకు ముగింపు లేకుండా పోయింది. ప్రస్తుతం మరో నివేదిక అన్ని వర్గాలను ఆందోళన కలిగిస్తోంది. తైవాన్, చైనా దేశాల నివేదికల్లోనూ కేన్సర్ లేదనేది గతంలో తేల్చారు. దేశంలోని అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ యూనివర్సిటీలు వక్కతో కేన్సర్ రాదని స్పష్టం చేశాయి. ఇవే నివేదికలు గతంలో ఇంటర్నేషనల్ మ్యాగజైన్‌లలో కథనాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిశీలించాల్సి ఉంటుందని వక్కరైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఎక్కడ చూసినా వక్కసాగే

వక్కసాగు దక్షిణాదిన అన్ని రాష్ట్రాల్లోనూ కొనసాగుతున్నా కర్ణాటకలోనే అత్యధికం. పశ్చిమకనుమలకు అనుబంధంగా ఉండే జిల్లాల్లో వాతావరణంలో తేమశాతం, వర్షం అధికంగా కురిసే ప్రాంతాల్లో వక్కసాగు చేస్తారు. ప్రధానంగా దక్షిణకన్నడ, ఉత్తరకన్నడ, ఉడుపి, శివమొగ్గ, చిక్కమగళూరు జిల్లాల్లో విస్తారంగా సాగు అవుతుండగా చిత్రదుర్గ, దావణగెరె, తుమకూరు, హాసన్, మండ్య, కొడగు, మైసూరు, చామరాజనగర జిల్లాల్లో ప్రాంతాలవారీగా వక్కసాగు చేస్తారు. వక్క పంట కోతకు వచ్చాక కోసి వాటిని తొక్కతీసి ఉడకబెట్టి ఆరిన తర్వాత మార్కెట్‌కు తరలిస్తారు. రాష్ట్రంలో 13 మార్కెట్లు ఉన్నాయి. ఏటా కోట్లాది రూపాయల టర్నోవర్ సాగుతుంది. వీటిలో చన్నగిరి, చిత్రదుర్గ, హొళల్కెరె, తీర్థహళ్ళి, శిరసి, సొరబలు ప్రధాన మార్కెట్‌లుగా ఉన్నాయి. రాష్ట్రంలో వివిధ రకాల వక్కలు సాగు చేస్తారు. సీక్యూసీపి, రాశి, పైలోన్, బిళగట్టు, చాలి, కెంపుగట్టు, బెట్ట, గొరబలు, తట్టిబెట్టి, సరుకు, కొత్తరకం వంటి వక్కలు మార్కెట్‌లో విక్రయిస్తుంటారు.



ఆశాజనకంగా లాభాలు

రైతులపాలిట వక్కసాగు ఆశాజనకంగా ఉంది. దీంతో అన్నదాత్లో ఆసక్తి పెరుగుతోంది. 100-200 ఎకరాలు వక్కతోటల రైతులు కోటీశ్వరులు. దావణగెరె, చిక్కమగళూరు, దక్షిణకన్నడ జిల్లాలు ఇలా వందలాది ఎకరాలు వక్కసాగు చేసేవారు అధికంగా ఉన్నారు. నాలుగేళ్లక్రితం రాష్ట్రంలో 4,52,650 హెక్టార్లలో వక్కసాగు అవుతుండేది. మంచి పంటతోపాటు ఒక్కసారి మొక్కలు నాటితే నాలుగైదేళ్లకు పంట దిగుబడి ఆరంభమవుతుంది. కనీసం 20-30ఏళ్లపాటు కేవలం నీరు, పోషకవిలువలను పర్యవేక్షిస్తే పంట చేతికి వస్తుంది. 2023నాటికి రాష్ట్రంలో 7,36,650 హెక్టార్లకు పెరిగింది. కేవలం మూడునాలుగేళ్లలో దాదాపు మూడు లక్షల హెక్టార్లు పెరిగిన తరుణంలో నివేదికలు బెంబేలెత్తిస్తున్నాయి. వక్కతోపాటు మిశ్రమపంటలు ప్రాంతాలవారీగా భిన్నమైనవి చేస్తున్నారు. ఏది ఏమైనా ఐసీఏఆర్ నివేదిక ఒక్కసారిగా వక్కరైతులలో ఆందోళనకు కారణమవుతోంది.



పీడీహళ్లి సమీపంలో కమ్ముకున్న పొగమంచు

ముంచెత్తుతున్న రహదారులు



తాళ్లు కట్టి కూలీలను కాలువ నుంచి బయటకు తీస్తున్న గ్రామస్థులు

కాలువలోకి దూసుకెళ్లిన వాహనం

- తాళ్లతో లాగి కూలీలను కాపాడిన స్థానికులు
- తప్పిన ప్రమాదం

వివరాలు 8లో..



ఎమ్మిగనూరు వద్ద రోడ్లపై ఆరబోసిన వరిధాన్యం

ఎవరికి చెప్పుకోవాలి..?

- తగ్గిన ధరలతో వరి రైతుకు ఆందోళన
- కొనుగోళ్లు పట్టని ప్రభుత్వం
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

కంప్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ధరలు తగ్గడంతో వరి రైతుకు ఆందోళన తప్పడం లేదు. ఖరీప్‌లో సాగు చేసిన వరి ఇప్పుడిప్పుడే కోత కోసి కల్లాలకు తరలిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి దిగుబడి బాగా తగ్గిపోయింది. దీనికి తోడు ధరలు కూడా పడిపోయాయి. వ్యాపారస్తులు కూడా వరి కొనుగోలుకు వెనుకంజ వేస్తున్నారు. 15 రోజుల క్రితం 75కిలోల బస్తా రూ. 1900 పలికేది ప్రస్తుతం రూ. 1200 నుంచి రూ. 1300 మాత్రమే పలకడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారస్తులు ఇష్టానుసారం అడుగుతున్నారని వారు వాపోతున్నారు. ప్రభుత్వాలు జిల్లాలో ఐదు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారే గానీ ఇప్పటి వరకు కొనుగోలు ప్రారంభించలేదు. కేవలం పేర్లు నమోదు చేసుకునేందుకు మాత్రమే అవకాశం కల్పించారు. దీంతో రైతులు వ్యాపారులకే అమ్మాల్సి వస్తోంది. పెట్టుబడులు, పిచికారీ మందులు, ఎరువులు, కూలీలు కూడా దక్కక తీవ్రంగా నష్టపోతామోనని వారు వాపోతున్నారు. కంప్లి, దేవసముద్రం, ఎమ్మిగనూరు, రామసాగరం, కురుగోడు, జానూరు, సన్నాపురం ముద్దాపురం తదితర గ్రామాలలో రైతులు పంట అమ్మకాల కోసం రోడ్లపైనే ఆరబోసుకుని వ్యాపారుల కొరకు ఎదురు చూస్తున్నారు. చివరకు వ్యాపారుల కోసం కాపలా కాసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వాలు ఉన్నా రైతులను ఆదుకోవడంలో విఫలమవుతున్నారన్నారు. త్వరలోనే జిల్లా స్థాయిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోతే జిల్లా స్థాయిలో కూడా రైతులు ర్యాలీలు, ప్రతిఘటనలు చేసేందుకు కూడా వెనుకంజ వేయమని తెలుపుతున్నారు.



ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీఎం, డీసీఎం

అన్ని వర్గాల అభివృద్ధికి ఇందిరమ్మ కృషి

- ఎందరో నేతలకు ఆదర్శం ఇందిరాగాంధీ
- జయంతి సభలో సీఎం సిద్ధరామయ్య

పేదరిక నిర్మూలన, బ్యాంకుల జాతీయీకరణ పథకాలతో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అన్నివర్గాల అభివృద్ధికి కారకులయ్యారని సీఎం కొనియాడారు. ఇందిర జయంతి సందర్భంగా నగరంలో ఆయన నివాళి అర్పించారు.

వివరాలు 7లో..

నేనేమైనా డ్యాన్స్ చేస్తున్నానా..?

- వీడియోలు తీస్తుండగా మీడియాపై ఆగ్రహం
- లోకాయుక్త కార్యాలయం వద్ద ముడా మాజీ కమిషనర్ నటేష్ హడావుడి..
- క్షమాపణలతో సమసిన వివాదం

బెంగళూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎడ్డమంటె తెడ్డమంటారనేది తెలియకుండా నోరుపారేసుకున్న ముడా మాజీ కమిషనర్ నటేష్ చివరకు దిగొచ్చి మీడియా ముందు ప్లీజ్ వదిలేయండి అంటూ వేడుకున్నారు. ముడా కమిషనర్‌గా నటేష్ వ్యవహరించిన కాలంలోనే సీఎం సిద్దరామయ్య భార్య పార్వతికి 14 స్థలాలు మంజూరు చేశారు. ఈ మేరకు కేసు విచారణ జరుపుతున్న లోకాయుక్త ఎస్పీ ఉదేష్ నోటీసులు ఇచ్చిన మేరకు మంగళవారం ఆయన విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకాయుక్త కార్యాలయంలోకి ఆయన ప్రవేశించేందుకు ముందు వీడియోలు తీస్తున్న మీడియా ప్రతినిధులపై విరుచుకుపడ్డారు. నేను ఏమైనా డ్యాన్స్ చేస్తున్నానా ఎగబడి వీడియోలు తీస్తున్నారంటూ మండిపడ్డారు. అధికారి వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు అవకాశం కోసం వేచి చూశారు. మధ్యాహ్నం దాకా విచారణ సాగగా భోజనానికి అరగంట విరామం ఇచ్చారు. ఇదే సమయంలో బయటకు వచ్చిన అధికారి నటేష్‌ను మీడియా సర్ లోపల బాగా డ్యాన్స్ చేశారా అంటూ పలువురు ప్రశ్నించారు. దీంతో దిగివచ్చిన అధికారి ప్లీజ్ వదిలిపెట్టండి అన్నారు. తనకు బిడ్డ, భార్య ఉన్నారని ఎన్నో ఒత్తిళ్ళు ఎదుర్కొంటున్నానని, నా వీడియోలు తీసుకుని ఏంచేస్తారని మాత్రమే అడిగానన్నారు. విచారణ ముగియలేదని భోజన విరామం ఇచ్చారని 14 సైట్ల్‌కు సంబంధించి ప్రశ్నలు వేశారన్నారు. నటేష్‌ను అరెస్టు చేయాలంటూ సామాజిక కార్యకర్త గంగరాజు డిమాండ్ చేశారు.

మహిళాశక్తి అనన్యం

తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూర్యపల్లి నంద

ప్రశాంతి నిలయంలో ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవానికి హాజరైన భక్తులు

దేశాన్ని మార్చగల సామర్థ్యం అతివల సొంతం

పుట్టపర్తి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మహిళాశక్తి అనన్యమని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూర్యపల్లి నంద అన్నారు. సత్యసాయి జయంత్యుత్సవాల రెండోరోజు మంగళవారం మహిళా దినోత్సవాలను ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో అట్టహాసంగా నిర్వహించారు. అనంతపురం మహిళా క్యాంపస్ విద్యార్థినులు మంగళవాయిద్యాలు, బ్యాండ్ మేళంతో పూర్ణకుంభాన్ని సాయికుల్వంత్ మందిరానికి తీసుకొచ్చారు. హైకోర్టు జడ్జి జ్యోతి ప్రజ్వలన చేసి, వేడుకలను ప్రారంభించారు. విద్యార్థినులు వేదపఠనం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హైకోర్టు జడ్జి ప్రసంగిస్తూ.. సత్యసాయి అందిస్తున్న విద్య, వైద్యం, తాగునీరు తదితర సేవలు వెలకట్టలేనివన్నారు. ఆధ్యాత్మిక విద్య, బోధనలు మానవాళిని శాంతి జీవనం వైపు ప్రయాణించేలా చేస్తున్నాయన్నారు. వేలాది మంది మహిళలు ఆధ్యాత్మిక, విలువలతో కూడిన విద్యను బోధిస్తుండడం హర్షణీయమన్నారు. పిల్లల పెంపకంలో తల్లి పాత్ర చాలా విశిష్టమైనదన్నారు. దేశాన్ని మార్చగల శక్తి మహిళకు ఉందన్నారు. ఎందరో మహిళలు దేశంలో ఉన్నత పదవులు అధిరోహించారనీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్మ, నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆ కోవలోకి వస్తారన్నారు. భారతీయ సంస్కృతిలో మహిళలకు ప్రత్యేక గౌరవం ఉందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ప్రపంచ దేశాలకు మన సంస్కృతి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అనంతరం విద్యార్థినులు భక్తిగీతాలు ఆలపించారు. జడ్జిని ట్రస్టు ప్రతినిధులు సన్మానించారు. సాయంత్రం ప్రియా సిస్టర్స్ సంగీత కచేరి నిర్వహించారు. హయ్యర్ సెకండరీ పాఠశాల విద్యార్థినులు సాయి అమృతధార చరిత పేరిట ప్రదర్శించిన నాటిక భక్తులను అలరించింది. వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యులు నాగానంద, సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సత్యసాయి మహా సమాధికి నమస్కరిస్తున్న జస్టిస్ నంద



జస్టిస్ సూర్యపల్లి నందకు స్వాగతం పలుకుతున్న రత్నాకర్



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి



బ్యాండ్ వాయిస్తున్న విద్యార్థినులు



పూర్ణకుంభంతో ర్యాలీగా వస్తున్న విద్యార్థినులు

విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, నవంబరు 19(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారాల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ సంస్థలు చేసిన ప్రతిపాదన వల్ల వినియోగదారులపై రూ.11,820 కోట్ల భారం పడుతోందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వినియోగించుకున్న విద్యుత్‌పై ప్రతి నెలా యూనిట్‌కు అదనంగా 50 పైసల నుంచి రూ.2.50 పైసల వరకు భారం పడుతోందన్నారు. విద్యుత్ భారాలు వేయబోమని ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీకి విరుద్ధంగా భారాలు మోపడం సరికాదన్నారు. విద్యుత్ కంపెనీలు చేసిన ప్రతిపాదనలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నించిన స్మార్ట్ మీటర్లను విమర్శించిన అప్పటి ప్రతిపక్షంలోని టీడీపీ కూటమి నేతలు నేడు అదే విధానాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు.

డిసెంబరు 23, 24 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు

డిసెంబరు 23, 24వ తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ వెల్లడించారు. మహాసభల్లో భాగంగా రానున్న మూడు సంవత్సరాల్లో చేపట్టాల్సిన కర్తవ్యాలను నిర్ణయిస్తామన్నారు. రైతు, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న మహాసభల జయప్రదానికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, సావిత్రి, రామిరెడ్డి, రామాంజనేయులు, నాగమణి, నిర్మల, జగన్, అచ్యుత్, మల్లికార్జున, నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్, వెంకటనారాయణ, గోపాల్, ముత్తుజ, ఇర్ఫాన్, చంద్రిక, పరమేష్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కౌలు గుర్తింపు కార్డు పొందిన ప్రతి రైతూ బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కృషిభవన్ నందు కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు ఉన్న రైతులు సమీప బ్యాంకుల్లో రుణాలు తీసుకోవచ్చు అన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది ఈ విషయాన్ని కౌలు రైతులకు వివరించి రుణాలు పొందేలా చూడాలన్నారు. 2024-25 సంవత్సరం రబీసీజన్ నుంచి ప్రతి రైతు తమ పంటల బీమా పథకం కోసం డిసెంబరు-15లోగా ప్రీమియం చెల్లించాలన్నారు. సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదును బట్టి నష్టం వాటిల్లిన సందర్భాల్లో పరిహారం వర్తిస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి కౌలు రైతులు అర్హులే అన్నారు. రైతులు బ్యాంకుల్లో రూ.20 ప్రధానమంత్రి సురక్షకు, రూ.440 ప్రధాన మంత్రి జీవనజ్యోతికి డబ్బులు చెల్లించి బీమాలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏడీ రవి, ఏఓ శశికళ, ఏఈఓలు మురళీకృష్ణ, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

సొంత స్థానాలకు పంపండి



డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్జీఓ నేతలు, ఆరోగ్య కార్యకర్తలు

అనంతపురం టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళా ఆరోగ్యకార్యకర్తలను వారి సొంత స్థానాలకు పంపాలని డీఎంహెచ్ఓకు ఎన్జీఓ నాయకులు, ఆరోగ్య కార్యకర్తలు వినతి పత్రం ఇచ్చారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య కార్యకర్తలు డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జీఓ నెంబరు 143 ప్రకారం మహిళా కార్యకర్తలను రీ-డిప్లాయ్‌మెంట్ పేరుతో ఇతర పీహెచ్‌సీలు, యుపీహెచ్‌సీలకు బలవంతంగా పంపించారని తెలిపారు. దీంతో అనేక మంది దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిపై వైద్యశాఖ కమిషనర్‌ను కలవగా రీ-డిప్లాయ్‌మెంట్ ఉత్తర్వులను రద్దును చేస్తూ ఆరోగ్యకార్యకర్తలను తిరిగి సొంతస్థానాలకు పంపిస్తామని ఉత్తర్వులు ఇచ్చారని వివరించారు.

యువతి అదృశ్యం

అనంతపురం క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ యువతి అదృశ్యమైంది. నగరంలోని వేణుగోపాల్‌నగర్‌కు చెందిన సిరాజుద్దీన్‌కు నిషాత్ అంజుమ్, నేహా అంజుమ్ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండో కుమార్తె నేహా అంజుమ్ ఇంటర్ వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటోంది. సిరాజుద్దీన్ బంధువు ఎవరో చనిపోతే నేహా అంజుమ్ మినహా కుటుంబసభ్యులంతా మంగళవారం ఉదయం 9గంటలకు మదనపల్లికి బయలుదేరి వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న ఆమె వారు సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సరికి కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లకు వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శవమై కనిపించిన పోస్టుమన్



రామాంజనేయులు (ఫైల్)

కళ్యాణదుర్గం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం పోస్టుమన్ చాకలి రామాంజనేయులు (62) అదృశ్యమైనట్లు కళ్యాణదుర్గం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం కళ్యాణదుర్గం మండలం హులికల్లు కొండ సమీపంలో అతడు రామాంజనేయులు వాడుతున్న ద్విచక్రవాహనం కనిపించింది. గొర్రెల కాపరులు.. పోలీసులకు సమాచారం అందించారు. వారు హులికల్లు కొండ వద్ద పరిశీలించగా రామాంజనేయులు శవం కనిపించింది. అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు అక్కడి ఆనవాళ్లను బట్టి పోలీసులు నిర్ధారించారు. పని ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కొన్నేళ్ల క్రితమే భార్య మృతి చెందడంతో ఒంటరిగానే జీవిస్తున్నాడు. మృతుడికి ఉమాదేవి, మహేష్ అను పిల్లలు వున్నారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిమెంట్ అక్రమార్కులపై చర్యలు

ఈఈ, డీఈఈ, ముగ్గురు జేఈల నుంచి రికవరీకి ఆదేశం.. రూ.2.52 కోట్లు దుర్వినియోగమైనట్లు నిర్ధారణ

అనంతపురం సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ శాఖలో సిమెంటులో అక్రమాలకు పాల్పడిన అధికారులను ఆ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర సబ్ డివిజన్ పరిధిలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించి ఆ శాఖకు చెందిన ఐదుగురు ఉద్యోగులను బాధ్యుల్ని చేస్తూ ఆశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శశిభూషణ్‌కుమార్ చర్యలు తీసుకున్నారు. 2021-22లో రూ. 2.52 కోట్లు విలువ చేసే సిమెంటును ఈఈ, డీఈఈతో మరో ముగ్గురు జేఈలు కలిసి ఈ అక్రమాలకు పాల్పడినట్లు అప్పట్లోనే గుర్తించారు. ఈఈని మినహాయించి మిగిలిన అధికారులను సస్పెండ్ చేశారు. తాజాగా పెనుకొండ డివిజన్ పీఆర్ఐ ఈఈ గోపాల్‌రెడ్డి (రిటైర్డు), మడకశిర అప్పటి డీఈఈ మల్లికార్జున, జేఈ పీఎస్ఎస్ రవికుమార్, గుడిబండ జేఈ కె.మద్దిలేటి, అగళి జేఈ బి. నాగన్నపై తాజాగా చార్జెస్ ఫ్రేమ్ చేశారు. దీంతో ఆ శాఖ ఉద్యోగుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలజడి రేపింది. దుర్వినియోగమైన రూ. 2.52 కోట్లు నగదును ఆయా ఉద్యోగుల్ని నుంచి రికవరీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఐదుగురు ఉద్యోగుల్లో ఈఈ గోపాల్‌రెడ్డి రిటైర్డ్ అయ్యారు. మిగిలిన డీఈఈ, ముగ్గురు జేఈలు వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తున్నారు. గతంలో ఇతర నియోజక వర్గాల్లో జరిగిన సిమెంట్ అక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వం ఆరాతీస్తున్నట్లు తెలుస్తోంది.

సీపీఐ మహిళా సమాఖ్య నేత మృతి

పార్టీ శ్రేణుల దిగ్భ్రాంతి.. నేడు మెడికల్ కళాశాలకు భౌతిక కాయం



శకుంతలమ్మ (ఫైల్)

అనంతపురం విద్య/కల్చరల్/అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకురాలు, మహిళా సమాఖ్య నేత శకుంతలమ్మ (66) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఒక వైపు వృద్ధాప్యం, మరోవైపు అనార్యోగంతో బాధపడుతున్న ఆమెను కుటుంబికులు నాలుగు రోజుల కిందట సాయినగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె మరణించారు. శంకుంతలమ్మ గతంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలిగా, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర నాయకురాలిగా పనిచేశారు. పార్టీకి, అనుబంధ సంఘాలకు ఎంతగానో సేవలు అందించారు. గత కొన్నేళ్ల కిందట ఆమెకు బైపాస్ సర్జరీ చేయించారు. నాలుగు రోజులు కిందట ఆరోగ్య సమస్యలు ఎదురుకావడంతో... ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పి వైద్య సేవలు అందించారు. మధ్యాహ్నం తర్వాత ఆమె తుది శ్వాస విడిచారు. సీపీఐ, ఏఐటీయూసీ, మహిళా సమాఖ్య నేతలు ఆమె మరణంపై తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు. బుధవారం ఆమె భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు వైద్య విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలకు అందించనున్నారు. శకుంతలమ్మ మృతి చెందడం బాధాకరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ, మహిళా సమాఖ్య నేతగా ఆమె ఎంతగానో సేవలు అందించారన్నారు. శకుంతలమ్మ పోరాటాలు ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి పేర్కొన్నారు. ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మహిళలు రాజకీయాల్లో రావాలంటే భయపడే రోజుల్లోనే ఆమె కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొన్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో కొనియాడారు. ఆమె మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించడం గొప్ప నిర్ణయమన్నారు.

రేపు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

బొమ్మనహాళ్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఈనెల 21న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ తెలిపారు. కళాశాలలో బోటనీ, జువాలజీ పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, వాటి భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. వృక్షశాస్త్రం, జంతుశాస్త్రంలో ఎమ్మెస్సీ పూర్తి చేసిన అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 21న మధ్యాహ్నం 2 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

గంజాయి విక్రేతల అరెస్టు




అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐలు

లేపాక్షి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని మంగళవారం హిందూపురం రూరల్ పోలీసులు మండలంలోని చోళసముద్రం గ్రామ సమీపాన అరెస్టు చేశారు. హిందూపురం అర్బన్, రూరల్ సీఐలు ఆంజనేయులు, జనార్దన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోళసముద్రం సమీపంలోని హెరిటేజ్ డెయిరీ వద్ద ఏపుగా పెరిగిన చెట్లలో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం దాడులు చేసి, ఆరుగురిని పట్టుకున్నారు. పరిగి మండలం సేవామందిరానికి చెందిన సయ్యద్ బషీర్‌అలీ, హిందూపురం రైల్వేరోడ్డు నివాసి వంశీకృష్ణ, రహమత్‌పురం ప్రాంతానికి చెందిన ఉదయ్‌కర్ణ, అహ్మద్‌నగర్ వాసి సైఫుల్లాఖాన్, లేపాక్షి మండలం పి.కొత్తపల్లికి చెందిన సయ్యద్ అమీర్, హిందూపురం మండలం మరువపల్లికి చెందిన పూరింటి తిమ్మప్ప పట్టుబడిన వారిలో ఉన్నారు. వారి నుంచి 1.8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో హిందూపురం వన్‌టౌన్ ఎస్ఐ శ్రీధర్, లేపాక్షి ఎస్ఐ నరేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్య ఉద్యమం

● నేడు, రేపు జీపు జాతా ● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర



మహాధర్నా కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం కల్చరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతాంగం, కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమం చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పేర్కొన్నారు. సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 26న కలెక్టరేట్ ముందు చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి, కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు లాభాలు కట్టబెట్టేందుకు రైతులు, కార్మికులు, ప్రజలపై భారాలు వేస్తున్నారని విమర్శించారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రూ.14.65 లక్షల కోట్లు మాఫీ చేసిందన్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతాంగానికి ఒక్క పైసా కూడా మాఫీ చేయలేదని పేర్కొన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతో ఈనెల 26న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసులు జారీ చేస్తూ చలో కలెక్టరేట్ చేపడుతున్నామన్నారు. చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని కోరుతూ బుధ, గురువారాల్లో జిల్లా వ్యాప్తంగా జీపుజాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, వివిధ సంఘాల నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తరిమెల నాగరాజు, భాస్కర్, జగన్మోహన్‌రెడ్డి, వెంకటనారాయణ, అచ్యుత్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీసీఈబీ కార్యదర్శిగా గంధం శ్రీనివాసులు



డీఈఓను కలిసిన గంధం శ్రీనివాసులు

అనంతపురం విద్య, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ) నూతన కార్యదర్శిగా గంధం శ్రీనివాసులు నియమితుడయ్యారు. ఈ మేరకు అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారి, డీసీఈబీ చైర్మన్ ప్రసాద్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. శ్రీనివాసులు కళ్యాణదుర్గం కేసీ గవర్నమెంట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కొత్తగా నియమితులైన శ్రీనివాసులు డీఈఓను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమాలతో పురుషోత్తం వెనక్కు.

గత రెండేళ్లలో డీసీఈబీలో అనేక అక్రమాలు చేశారు. ప్రశ్నపత్రాల ముద్రణ, సరఫరా, టెండర్లు.. ఇలా ప్రతి అంశంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. 2022-20 23, 2024-25 విద్యా సంవత్సరాల్లో జరిగిన అనేక గోల్‌మాల్ వ్యవహారాలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వచ్చాయి. దీంతో జిల్లా కలెక్టర్, కడప ఆర్జేడీ వేర్వేరుగా విచారణకు ఆదేశించారు. విచారణ తర్వాత గత నెల 30న డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తం బాబుపై ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ ఫ్రేం చేయాలని ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీచేశారు. అదే విధంగా పురుషోత్తంబాబును డీసీఈబీ కార్యదర్శి పోస్టు నుంచి తప్పించాలంటూ జిల్లా విద్యాశాఖాధికారికి ఆదేశాలిచ్చారు. దీంతో డీఈఓ ప్రసాద్‌బాబు డీసీఈబీ కార్యదర్శిగా గంధం శ్రీనివాసులును నియమించారు. డీసీఈబీ కార్యదర్శి బాధ్యతలను శ్రీనివాసులకు అప్పగించాలని పురుషోత్తం బాబును ఆదేశించారు.


నేటి నుంచి పెయ్య దూడలకు టీకాలు

అనంతపురం అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనంత ఉమ్మడి జిల్లాలోని 4 నుంచి 8 మాసాల వయస్సు కలిగిన పెయ్య దూడలకు బుధవారం నుంచి ఉచిత బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేస్తామని పశుసంవర్థక శాఖ జేడీ వెంకటస్వామి, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రామచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబరు 19వరకు టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని 13,800 పెయ్యదూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలను వేయాలని నిర్ణయించామన్నారు. అనంత జిల్లాకు 6,060 డోసులు, శ్రీసత్యసాయి జిల్లాకు 6,750 డోసుల టీకాలు సరఫరా చేశామన్నారు. పశువుల్లో జ్వరం, బలహీనత, చూడి ఆఖరి దశలో గర్భస్రావం, మాయ వేయకపోవడం, గర్భస్రావాలు, చూడి నిలవకపోవడం బ్రూసెల్లోసిస్ వ్యాధి లక్షణాలన్నారు. వ్యాధి సోకిన పశువుల నుంచి మనుషులకు సోకుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని తప్పనిసరిగా బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

లియో టాల్‌స్టాయ్ (వర్ధంతి)



రష్యా దేశ ప్రముఖ రచయిత, సాహితీవేత్త లియో టాల్‌స్టాయ్ 1828 సెప్టెంబరు 9న జన్మించారు. వార్ అండ్ పీస్ (1869), అన్నా కరెనినా (1877) నవలలు ఎంతో పేరొందాయి. ది కింగ్‌డమ్ ఆఫ్ గాడ్ ఈజ్ వితిన్ యూ (1894) అనే రచన 20వ శతాబ్ధంలో ఎందరినో ప్రభావితం చేసింది. ఆయన నాటికలతో ఫిలాసఫీపై రచనలు చేశారు. మిలిటరీ సర్వీస్‌లో కొన్ని కవితలు కూడా రాసి సైనికులను ఉత్తేజ పరిచారు. ఆయన రచనలకు పలుమార్లు నోబెల్ పురస్కారానికి నామినేట్ అయినా దక్కక పోవడం గమనార్హం. 1910 నవంబరు 20న కన్నుమూశారు.

అన్ని వర్గాల అభివృద్ధికి ఇందిరమ్మ కృషి

సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో పేదరిక నిర్మూలన, బ్యాంకుల జాతీయీకరణ వంటి చారిత్రాత్మక పథకాలతో అన్నివర్గాల అభివృద్ధికి కారకులయ్యారని సీఎం సిద్దరామయ్య కొనియాడారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని విధానసౌధలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలుచల్లి నివాళులు అర్పించారు. అనంతరం అధికారులతో కలసి జాతీయ ఐక్యతా వారోత్సవాల ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కేపీసీసీలో జరిగిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిరంతరంగా పేదలు, దళితులు, బీసీలు, మైనారిటీలు, మహిళలు, రైతులపక్షాన పనిచేసిందన్నారు. రాజ్యాంగానికి అనుగుణంగా పాలన సాగించడం పార్టీ ఆశయమన్నారు. డీసీఎం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్ మాట్లాడుతూ మా ప్రభుత్వం ద్వారా పేదలకు అన్యాయం జరగదన్నారు. గ్యారెంటీలను ఆపడం ఎవరితోనూ సాధ్యం కాదన్నారు. వివిధ విభాగాలలో రాణించిన మహిళా సాధకులను సత్కరించారు.



మహిళా సాధకులకు సన్మానం

సంగీత మహావిద్యాలయలో గజ్జెపూజ

చింతామణి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): భారతీయ శాస్త్రీయ నృత్య పరంపరలో భాగంగా గజ్జెపూజ ఒకటి. నృత్యం నేర్చుకోవాలనుకునే విద్యార్థులు తమ నృత్య పయనంలో తొలుత గజ్జెలకు పూజ చేయడం ఆనవాయితీ. పట్టణంలోని అంజని లే అవుట్‌లో చింతామణి సంగీత మహావిద్యాలయలో మంగళవారం భక్త కనకదాస జయంతి, గజ్జెపూజ కార్యక్రమాన్ని, కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. భరతనాట్యం నేర్చుకునే విద్యార్థుల తోపాటు తదితరులు పాల్గొన్నారు. గురువులనుంచి గజ్జెలు అందుకున్న చిన్నారులు పూజ చేసి వారి ఆశీర్వాదం పొంది నృత్య ప్రదర్శన చేశారు. సంగీత విద్వాన్ శ్రీనివాసరెడ్డి దశాబ్దాలక్రితమే చింతామణి గాయన సమాజాన్ని స్థాపించి ఏటా వందలాదిమందికి సంగీతాన్ని అందిస్తున్నారని వక్తలు కొనియాడారు. గాయన సమాజం నాగేంద్రరెడ్డి, చింతామణి సంగీత పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతిలు పాల్గొన్నారు.



గజ్జెపూజలో పాల్గొన్న విద్యార్థులు

దర్శకుడిపై హీరో కాల్పులు

▸▸ అరెస్ట్ చేసిన పోలీసులు

బెంగళూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): 'ముగిల్‌పేట' దర్శకుడు భరత్‌పై హీరో క్యారెక్టర్ తాండవరాం తుపాకీతో కాల్చిన సంఘటనలో చంద్రా లే అవుట్ పోలీసులు అరెస్టు చేశారు. ముగిల్‌పేట సినిమాకు భరత్ దర్శకుడు కాగా తాండవరాం హీరోగా ఉన్నారు. వివిధ కారణాలతో సినిమా షూటింగ్ అర్ధాంతరంగా ముగిసింది. ఈ విషయమై దర్శకుడు, నటులు మంగళవారం భేటీ అయ్యారు. అర్ధాంతరంగా సినిమా ఎలా ముగిస్తావంటూ..? తాండవరాం వాదించాడు. ఇద్దరిమధ్య వివాదం జోరందుకున్న వేళ ఆవేశంలో భరత్‌పై తుపాకీతో తాండవరాం కాల్పులు జరిపాడు. అయితే బుల్లెట్‌లు దర్శకుడికి కాకుండా గోడకు తగిలాయి. ఇలా దర్శకుడు ప్రాణాలతో బయటపడ్డాడు. భరత్ ఫిర్యాదు మేరకు చంద్రా లే అవుట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని తాండవరాంను అరెస్టు చేశారు.

సీఎస్ఆర్ నిధులతో చెరువుల అభివృద్ధి

మహదేవపుర, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మహదేవపుర నియోజకవర్గంలోని ప్రైవేట్ సంస్థలు స్థానిక ప్రభుత్వ పాఠశాలలు, చెరువుల అభివృద్ధికి ఇచ్చి ప్రోత్సహిస్తున్నా యని మాజీ మంత్రి, మహదేవపుర నియోజకవర్గ టాస్క్‌ఫోర్స్ అధ్యక్షుడు అరవింద లింబావళి పేర్కొన్నారు. బయ్యప్పనహళ్ళి గ్రామంలో టార్గెట్ అనే ప్రైవేట్ సంస్థ రూ.2.5కోట్ల సీఎస్ఆర్ గ్రాంట్‌తో యునైటెడ్ వేట్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో చెరువు అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. సమాజ ప్రగతిలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వంతోపాటు ప్రైవేట్ సంస్థల సహకారం అవసరమన్నారు. ఇలా ఇప్పటికే పలు సంస్థలు ముందుకొచ్చి చెరువు, ప్రభుత్వ పాఠశాల, శుద్ధ తాగునీటి విభాగాలు ఇతరత్రా అభివృద్ధికి సహకరించాయన్నారు. మరింతగా సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చెరువుకు అనుబంధంగా వాకింగ్ ట్రాక్, కోనేరు, వినాయక చవితి, దుర్గాపూజ, ఛట్ పూజలకు అవకాశం కల్పించడంతోపాటు నిమజ్జనానికి వీలు కల్పించేలా తగిన సదుపాయాలు కల్పించాలని ప్రజలనుంచి వినతులు వచ్చాయని ఆమేరకు సీఎస్ఆర్ గ్రాంట్లతో చర్యలు తీసుకుంటామన్నారు. చెరువు మొత్తం 32 ఎకరాలలో విస్తీర్ణం ఉందని 174 మిలియన్ లీటర్ల సామర్థ్యం ఉందని చెరువు అభివృద్ధికి సహకారం ఉంటుందని యునైటెడ్ వే ప్రతినిధి ఒకరు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ జలశక్తి అధ్యక్షుడు, బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, గ్రామీణ అధ్యక్షుడు నటరాజ్, టార్గెట్ కంపెనీ, యునైటెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, కంట్రాక్టర్ అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



ప్లాన్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి అరవింద లింబావళి

ఘనంగా గురువందన



గురువులతో పూర్వ విద్యార్థులు

శిడ్లఘట్ట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరస్వతి విద్యా సంస్థలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో గురువందనా కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. 1993-94 సంవత్సరానికి చెందిన ఎస్ఎస్ఎల్‌సి విద్యార్థుల ఆధ్వర్యంలో పట్టణంలోని వాసవికల్యాణమండపంలో కార్యక్రమం సాగింది. పాఠశాల పూర్వ విద్యార్థి, కాంగ్రెస్ నాయకుడు సమాజసేవకుడు పుట్టు ఆంజినప్ప పాల్గొని పర్యావరణ ప్రేమికుడు బెళ్ళూటి సంతోష్‌ల సేవలను ప్రస్తావించి ఉద్వేగానికి లోనయ్యారు. 30ఏళ్ల తర్వాత పూర్వవిద్యార్థులంతా ఒక బృందంగా ఏర్పడి తమ గురువులను సత్కరించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు గోపినాథ్, దాశరథి, బైయణ్ణ తదితరులు ప్రసంగిస్తూ గురుశిష్యుల అనుబంధం అమూల్యమైనదన్నారు. ఆంజినప్ప మాట్లాడుతూ గురువుల ఆశీర్వాదంతో ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చునన్నారు. అక్షరజ్ఞానం నేర్పించిన గురువులకు సదా వందనమన్నారు. పూర్వవిద్యార్థులు వివిధ రంగాలలో స్థిరపడ్డారని ఒకరినొకరు పరిచయం చేశారు. సరస్వతి విద్యాసంస్థ కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆంజనేయగౌడ, జిల్లా ఫార్మసిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు డిఎస్ రహంతుల్లా, పూర్వ విద్యార్థులు రోహిణి, సమీలుల్లా, మంజుళా నాగరాజ్, ప్రభాకర్, దేవప్ప తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో మావళ్ళి శంకర్ తదితరులు

దొమ్మసంద్ర, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర సమీపాన యమరె గ్రామపంచాయతీ పరిధిలోని బి హొసహళ్ళి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి, అంబేడ్కర్ భవనాన్ని ప్రారంభించారు. దళిత సంఘర్ష సమితి రాష్ట్ర సంచాలకులు మావళ్ళి శంకర్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా మహిళలకు హక్కులు, అధికారం అవకాశం కల్పించారని జీవితాన్ని సుగమం చేసుకునేందుకు వీలు కల్పించారన్నారు. సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలు తొలగాలంటే విద్యాజ్ఞానం పెరగాలన్నారు. ప్రభుత్వాలు విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తున్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంబేడ్కర్ సేవా ట్రస్టు అధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా అన్నివర్గాల క్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. వెనుకబడినవర్గాలను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కేపీసీసీ కార్మిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్, సర్జాపుర గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు వై శ్రీరాములు, శంభయ్య, ఎస్ఎం శ్రీనివాస్, బుడగప్ప, యమరె గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు సులోచనా రవి, పోరాటనాయకుడు డాక్టర్ వై చిన్నప్ప చిక్కహాగడె తదితరులు పాల్గొన్నారు.

బస్సులపై రాళ్ల దాడి



ధ్వంసమైన బస్సు అద్దాలు

రాయచూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని హట్టి బంగారు గని కంపెనీ సమీపంలోని గొలపల్లి వద్ద మంగళవారం రెండు ఆర్టీసీ మరో మూడు ప్రైవేటు బస్సుల పై గుర్తు తెలియని ఆగంతకులు దాడికి దిగారు. దాదాపు మధ్యరాత్రి దాటిన అనంతరం రెండు గంటల ప్రాంతంలో బీదర్, కబలుర్గి ఔరాద్ నుంచి బళ్లారి వైపు వెళుతున్న బస్సుల పై గుర్తు తెలియని వ్యక్తులు అకస్మాత్తుగా రాళ్లతో దాడికి దిగారు. తొలుత బస్సులను ఆపే ప్రయత్నం చేయగా డ్రైవర్లు ఆపకుండా వెళ్లడంతో ఈ దాడి జరిగింది. కాగా ఈ మార్గంలో గురుగుంటా మీదుగా గొలపల్లి దాటి లింగసుగూరు చేరాల్సి ఉండగా ఆ దారి మొత్తం ఇరుకుగా ఉండడమేగాక మలుపులు ఎక్కువగా ఉండడంతో వాహనాలు నిదానంగా రావడం పరిపాటి. ఈ క్రమంలో అదే మార్గాన్ని ఎంచుకున్న కొంత మంది దుండగులు బస్సులను దోపిడి చేసేందుకే నిలిపి ఉంటారని డ్రైవర్లు అనుమానించారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ భద్రప్ప, దుండగులు 10 నుంచి 12 మంది ఉంటారని లింగసుగూరు డిపో అధికారులకు అటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తొలుత సంఘటన స్థళాన్ని పరిశీలించిన లింగసుగూరు డిపో అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థళాన్ని పోలీసులు పరిశీలించారు. కాగా దుండగులు విసిరిన రాళ్లతో బస్సులకు ముందు వెనక అద్దాలు ధ్వంసం కాగా ప్రయాణీకురాలొకరికి చేతికి గాయమైనట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆమెను చికిత్స కోసం లింగసుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. ఇందుకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా బస్సుల పై దాడికి దిగింది స్థానికులా? లేదా దూర ప్రాంతానికి చెందిన ఎవరైన దొంగలా? అన్నదాని పై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

పేదరిక నిర్మూలనకు ఇందిర బాటలు

బంగారపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో పేదరిక నిర్మూలనకు, ఆర్థిక అభివృద్ధికి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ బాటలు వేశారని ఆత్మవిశ్వాస వేదిక సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ భారద్వాజ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదురుగా ఆత్మవిశ్వాస వేదిక, దళితశక్తిసేన సంయుక్తంగా మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భారద్వాజ్ మాట్లాడుతూ సమర్థనీయులైన ప్రధానులలో ఇందిరాగాంధీ ఒకరుగా నిలిచారన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, దేశాభివృద్ధికి సమన్వయంగా కృషి చేశారన్నారు. 20అంశాల కార్యక్రమం ప్రజల మనస్సుల్లో నిలిచిందన్నారు. దక్షత కల్గిన పాలన, ప్రామాణిక సేవ, నిబద్ధత నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. వెనుక బడినవర్గాల ఉన్నతికి ఎన్నో పథకాలు రూపొందించిన ఘనత ఆమెదే అన్నారు. ఈ సందర్భంగా వెంకటప్ప, మునిరత్నం, మునియప్ప, శ్రీనివాస్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ జయంతిలో భారద్వాజ్ తదితరులు

వీరాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు

శిడ్లఘట్ట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతామణి రోడ్డులో యోగినారేయణ యతీంద్రనగర్‌లో కొలువైన పురాతనమైన వీరాంజనేయ స్వామి ఆలయంలో కార్తీక సోమ, మంగళవారాలలో విశేషపూజలు కొనసాగాయి. ఉదయం అభిషేకం, సాయంత్రం స్వామివారికి తమల పాకులతో అలంకరణ, పూజలు నిర్వహించారు. ధూపదీప నైవేద్యాల సమర్పించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. విశేషపూజల్లో పాల్గొన దలిచారు ఆలయ కమిటీని సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. కార్తీక మాస పూజలు కొనసాగుతాయన్నారు.



విశేష అలంకరణలో స్వామివారు

గ్రామపంచాయతీ సభ్యురాలిగా ఏకగ్రీవం



రత్నమ్మను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్ తదితరులు

శిడ్లఘట్ట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని వై హుణసేనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని మారనహళ్ళి గ్రామానికి చెందిన శ్రీనివాసప్ప అకాల మరణంతో తలెత్తిన పంచాయతీ సభ్యత్వ ఎన్నికల్లో శ్రీనివాసప్ప తల్లి రత్నమ్మ ఏకగ్రీవమయ్యారు. నూతన సభ్యురాలిని ఎమ్మెల్యే రవికుమార్, గ్రామ ప్రముఖులు అభినందించారు. ఈ సందర్భంగా రత్నమ్మ మాట్లాడుతూ శ్రీనివాసప్ప చేపట్టదలిచిన అభివృద్ధి పనులకు ఇతర సభ్యులు సహకరించి సాకారం చేయాలని కోరారు.

నేడు వైన్‌షాప్‌లు యథాతథం

▸▸ ముఖ్యమంత్రితో చర్చలు సఫలం

బెంగళూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అబ్కారీ అధికారుల వేధింపులతోపాటు పలు సమస్యలపై బుధవారం రాష్ట్రవ్యాప్తంగా వైన్ షాప్‌ల మూసివేత నిరసన అంశాన్ని విరమించుకున్నారు. మంగళవారం సీఎం సిద్దరామయ్యతో ఫెడరేషన్ ఆఫ్ వైన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గురుస్వామి, ప్రధాన కార్యదర్శి గోవిందరాజ హెగ్డేతోపాటు పలువురు చర్చలు జరిపారు. ముఖ్యమంత్రి సమస్యల పరిష్కారానికి సానుకూలత వ్యక్తం చేయడంతో నిరసనను విరమిస్తున్నట్టు ప్రధాన కార్యదర్శి గోవిందరాజ హెగ్డే ప్రకటించారు.



వినతి ప్రతం అందజేస్తున్న వైన్ మర్చంట్స్ అసోసియేషన్ పదాధికారులు

వడెర్లను ఎస్టీ జాబితాలో చేర్చండి

వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తిరూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లక్షలాది జనాభా ఉన్న వడ్డెర్లను ఎస్టీ జాబితాలోకి చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి శాసనసభలో ప్రస్తావించారు. మంగళవారం శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో వడ్డెర్ల ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వడ్డెర్లను ఎస్టీజాబితాలోకి చేర్చే దిశగా అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ వడ్డెర్ల చిరకాల స్వప్నాన్ని పక్కన పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దరిమిలా రానున్న పార్లమెంటు సమావేశాల్లో బిల్లు అమోదం పొందేలా ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే కోరారు. స్వాతంత్ర్య సమరయోధుడు, వడ్డెర్ల హక్కుల కోసం పోరాడిన వీరుడు వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్రపండుగగా గుర్తించి, ప్రభుత్వం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వడ్డెర్లు పనిచేసే క్వారీల్లో వారికి 25 శాతం కేటాయించాలని ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తెసుకెళ్లారు. రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిన వడ్డెర కులస్తులను అన్ని విధాలా ఆదుకునేందుకు వడ్డెర కార్పొరేషన్‌కు అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే కోరారు. వెనుకబడిన పుట్టపర్తి నియోజకవర్గంలో 195 చెరువులను హంద్రీనీవా నీటితో నింపే ప్రాజెక్టు పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి.. శాసనసభలో ప్రస్తావించారు. 2018లో జీఓ నంబరు 201 ద్వారా నియోజకవర్గంలోని ఆరు మండలాలకు హంద్రీనీవా కాలువ ద్వారా నీరందించడానికి డీపీఆర్ తయారీకి రూ.3.34 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు మరుగున పడిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేస్తే 10వేల ఎకరాలకు సాగునీరు, 2.34 లక్షల మందికి తాగునీరు లభిస్తుందని మంత్రి నిమ్మల దృష్టికి తీసుకెళ్లారు.

వైసీపీలో భగ్గుమన్న విభేదాలు

గోరంట్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల వైసీపీలో విభేదాలు భగ్గుమన్నాయి. మాజీ మంత్రి మాలగుండ్ల శంకర్‌నారాయణ, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ వర్గాల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. మండలంలోని వైసీపీ నాయకులు పాటూరి శంకర్‌రెడ్డి, నాగేనాయక్, కుటాల బాబును అధిష్టానం పార్టీ నుంచి సస్పెండ్ చేయడం మాలగుండ్ల శంకర్‌నారాయణ, ఉషశ్రీ వర్గాల మధ్య నిప్పు రాజేసింది. ఇరువర్గాల నాయకులు సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ పోస్టింగులు పెట్టారు. గోరంట్లలో ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయిలో వార్ నడుస్తున్న విషయం విదితమే. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఇరువురిని కలిసి పనిచేయాలని స్వయంగా ఆదేశించినా ప్రయోజనం లేదు. మండలంలోని బూదిలివాండ్లపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త రంగప్ప ఇంటిపై వైసీపీ నాయకుడు, వానవోలు ఉపసర్పంచ్ కుటాల బాబు.. అనుచరులతో వెళ్లి దాడి చేయడమే కాకుండా విధ్వంసం సృష్టించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొన్నిరోజులక్రితం శంకర్‌నారాయణ.. పార్టీ నాయకులను వెంటబెట్టుకుని గోరంట్ల పోలీసు స్టేషన్‌కు వచ్చి నిందితులను బెయిల్‌పై తీసుకెళ్లారు. దీంతో ఉషశ్రీ వర్గం సమావేశమై పార్టీ కోసం పనిచేస్తే సహకరిస్తామనీ, గ్రూపు రాజకీయలు చేస్తూ తమ మధ్య చిచ్చుపెట్టాలని చూస్తే సహించేదిలేదంటూ శంకర్‌నారాయణను హెచ్చరించింది. వెన్నుపోటు రాజకీయాలు చేయడనికి మళ్లీ గోరంట్లకు వస్తే అడ్డుకుంటామని హెచ్చరించింది. ప్రత్యర్థి వర్గం వెంటనే ప్రతిస్పందిస్తూ శంకర్‌నారాయణను అడ్డుకుంటే తాము ఉషశ్రీని అడ్డుకుంటామని సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో మండలానికి చెందిన వైసీపీ నాయకులు సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు కాటూరి శంకర్‌రెడ్డి, గోరంట్ల సర్పంచ్ సరోజ భర్త నాగేనాయక్, వానవోలు ఉపసర్పంచ్ కుటాల బాబును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ వైసీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. దీనిని పార్టీ నాయకులు సోషల్ మీడియా ద్వారా మంగళవారం బహిర్గతం చేశారు. దీంతో ఇరువర్గాల వారు సోషల్ మీడియా వేదికగా విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకున్నారు. రాజకీయ నియంతకు మరో రూపం ఉషశ్రీ అనీ, పెనుకొండ నియోజకవర్గంలో నియంత రాజకీయాలకు అంకురార్పణ చేశారని నాగేనాయక్ విమర్శించారు. అధికారంలో ఉంటూ కళ్యాణదుర్గంలో సొంత పార్టీవారిపై అక్రమ కేసులు పెట్టించారనీ, ప్రస్తుతం అధికారం లేక బిక్కుబిక్కుమంటున్న తరుణంలో పెనుకొండలో సొంత పార్టీవారిని సస్పెండ్ చేయించారన్నారు. జిల్లా మొత్తాన్ని భ్రష్టు పట్టించేదాకా వదలకంటూ ఉషశ్రీపై విమర్శలు గుప్పించాడు. ఆమెను తరిమికొట్టే రోజు ఎంతో దూరంలో లేదని మండిపడ్డాడు. ఈ నేపథ్యంలో సస్పెండైన నాయకులు బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేస్తుండడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సమావేశానికి ఎవరూ వెళ్లవద్దంటూ ఉషశ్రీ వర్గీయులు.. ఇప్పటికే కార్యకర్తలను హెచ్చరిస్తున్నట్లు తెలిసింది.

వైసీపీ నాయకుడిపై కేసు

కదిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 31వ వార్డు కౌన్సిలర్ బీబీజాన్ కుమారుడు, వైసీపీ నాయకుడు ఎస్‌కే వలిపై మంగళవారు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఎస్‌కే వలి పట్టణానికి చెందిన ఓ ఒంటరి మహిళను వేధిస్తున్నాడన్నారు. అర్ధరాత్రుల్లో ఫోన్ చేస్తూ, మహిళ ఇంటి వద్దకెళ్లి అసభ్యంగా మాట్లాడుతూ వేధింపులకు పాల్పడేవాడన్నారు. ఈనెల 14వ తేదీన కోరిక తీర్చాలని ఆమెను కోరాడు. దీనికి నిరాకరించిన మహిళపై బజారులోనే దాడి చేశాడు. ఈనెల 18వ తేదీన ఎస్‌కే వలి.. అమె ఇంటి వద్దకెళ్లాడు. ఆ సమయంలో అమె ఇంటి వద్ద లేదు. ఆమెను చంపేస్తానని పక్కంటి వారితో చెప్పి బెదిరించాడు. దీంతో బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.08	1,601.89
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,269	1,829
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,007	8,450
నీటి నిల్వ (టీఎంసీలు)	98.18	24.06

చీకటికి జాతీయ వెలుగులు

- జాతీయస్థాయి పోటీలకు 'చీకటి బతుకులు' నాటిక
- రాఘవ మెమోరియల్ అసోసియేషన్, జిల్లా కళాకారుల హర్షం



చీకటిబతుకులు నాటికలో ఓ సన్నివేశం

బళ్లారి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కళాకారులు నటించిన చీకటి బతుకులు నాటిక జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ఏపీలోని కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం భోగాపురం కళాపరిషత్ తృతీయ నాటిక వార్షిక మహోత్సవం కొణిదెల పవన్ కళ్యాణ్ జాతీయస్థాయి నాటిక పోటీల్లో ఈ నాటిక ప్రదర్శించనుంది. జీఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు అధ్యక్షుడు, రచయిత, దర్శకత్వం వహించిన విశ్రాంత తెలుగు ప్రిన్సిపాల్ జీఆర్ వెంకటేశులు రచించి, నటించిన ఈ నాటిక జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ఈనాటిక ను బళ్లారి రాఘవకళామందిరంలో న్యాయ నిర్ణేతలు తాళబత్తుల వెంకటేశ్వరరావు, గంటా ముత్యాలనాడు సమక్షంలో ప్రదర్శించారు. విశ్రాంత తెలుగు ప్రిన్సిపాల్ జీ.ఆర్ వెంకటేశులు ఈ నాటికకు దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాటిక జనవరి జనవరి 18న కాకినాడ జిల్లా భోగాపురంలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. నాటిక జాతీయ స్థాయికి ఎంపికవడంపై హర్షం వ్యక్తంచేశారు. నాటికలో నటించన జీఆర్ వెంకటేశులు, ఆదోని వీణ, రామచంద్ర, హసీనా (దేవసేన), నాగభూషణ, రామాంజనేయులు, శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. నాటిక, కళాకారులను ప్రోత్సహించిన రాఘవ మెమోరియల్ అసోసియేషన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ముంచెత్తుతున్న మంచు

బళ్లారిరూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రెండు, మూడు రోజులుగా పలు రహదారులు మంచుతో కమ్మేస్తున్నాయి. తాలుకాలోని పీడీ హళ్లి పరిధిలో మంగళవారం ఉదయం పొగ మంచుతో రహదారులు మూసుకుపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. లైట్లు వేసుకుని ప్రయాణం కొనసాగించారు. ఉదయం 8 గంటల వరకు పొగ మంచు కమ్మేసి ఉందని స్థానికులు తెలిపారు.

రైతుల భూములను లాక్కుంటే సహించం

- వక్ఫ్ నోటీసులకు వ్యతిరేకంగా రేపు నిరసన
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయుడు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయుడు

బళ్లారి సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ నోటీసుల పేరుతో రైతుల భూములు లాక్కుంటే సహించేది లేదని ఈనెల 21న 'మా భూమి మా హక్కు' పేరుతో నిరసన చేపట్టనున్నట్లు బీజేపీ జిల్లాధ్యక్షుడు అనిల్‌నాయుడు పేర్కొన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రైతుల ఆస్తులు, మఠాలు, దేవాలయాలను అక్రమంగా వక్ఫ్‌కు అప్పజెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లాలోని కబరస్థాన్, మసీదులకు చెందిన 65ఆస్తులను కూడా వక్ఫ్‌గా పేర్కొన్నారు. సిరుగుప్ప తాలూకా ఇబ్రహీంపుర గ్రామం, బళ్లారి తాలూకా బొమ్మనహాల్ చెందిన రైతుల భూములను వక్ఫ్‌గా నమోదు చేశారన్నారు. డిసెంబరుమొదటి వారంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర నేతృత్వంలోని బృందం బళ్లారికి రానుందన్నారు. బాధిత రైతులు సంప్రదిస్తే వారి తరుపున పోరాడతామన్నారు. రైతుల ఆస్తులు దోచుకునేందుకు సీఎం సిద్దరామయ్య, వక్ఫ్ మంత్రి జమీర్ అహ్మద్ ప్రయత్నిస్తున్నారన్నారు. వక్ఫ్ ఆస్తులను కాపాడేందుకు మాకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ అమాయకుల ఆస్తులను లాక్కుంటే సహించేది లేదని పాటిల్‌సిద్దారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత ఆస్తులను వక్ఫ్‌గా చూపడం తగదన్నారు. వక్ఫ్ పైనే తమ పోరాటమన్నారు. ప్రజా ఆస్తులపై జిహాద్‌కు తావులేని ఆయన అన్నారు. శంకరప్ప తోరణగల్లు, పెద్ద హులుగప్ప పాల్గొన్నారు.

నిరంతర అభ్యాసంతో విజయం

- ఎస్కేయూ వీసీ మునిరాజు



మాట్లాడుతున్న వీసీ మునిరాజు

బళ్లారి సిటీ, నవంబరు19(ఆంధ్రజ్యోతి): నిరంతర అభ్యాసంతో ఉద్యోగార్థులు విజయం సాధించవచ్చని విజయనగర శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ మునిరాజు సూచించారు. యూనివర్శిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన పోటీ పరీక్షల శిక్షణ, గైడెన్స్ యూనిట్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే కర్ణాటక స్టేట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎలిజిబిలిటీ టెస్ట్(కేసెట్) శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణ అభ్యర్థులకు ఉచితంగా అందించ బడుతుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు నిత్యం పత్రికలు చదివి జ్ఞానం పెంచుకోవాలన్నారు. మరో అతిథి ప్రొఫెసర్ ప్రహ్లాద్ మాట్లాడుతూ యూనివర్శిటీలో అపారమైన విజ్ఞానం దాగి ఉందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనివర్శిటీ ఛాన్సలర్ ప్రొపేసర్ ఎం.మునిరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎన్నో విజయాలు సాధంచారన్నారు. కష్టపడి విజయం సాధించి తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలన్నారు. అభ్యర్థులకు మౌలికసదుపాయాలు కల్పిస్తామని, లోటుపాట్లుంటే తనను సంప్రదించాలన్నారు. శిక్షణలో 100మందికి పైగా కే-సెట్ అభ్యర్థులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా జ్ఞాన్ బుత్తి సంస్థకు చెందిన జైనహళ్ళి సత్యనారాయణగౌడ, యూనిట్ డైరెక్టర్ ప్రొ.భీమనగౌడ, కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, వివిధ సంస్థల డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కూలీల వాహనం

రాయచూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పది మంది కూలీలను తీసుకెళుతున్న టాటాఏస్ వాహనం ఒకటి డ్రైవర్ అదుపు తప్పి ఎన్ఆర్‌బీసీ కాలువలోకి దూసుకెళ్లింది. జిల్లాలోని దేవదుర్గ తాలూకా మరసకల్(జాడలదిన్ని) సమీపంలో మంగళవారం జరిగిన ఈ సంఘటనలో కూలీలెవ్వరు ప్రాణ హానికి గురి కాలేదు. కాలువ కచ్చా రోడ్డుపై వెళుతున్న వాహనం డ్రైవర్ అదుపు తప్పి కాలువలోకి దిగిపోవడంతో ఒక్కసారిగా కూలీలు హాహాకారాలు చేశారు. నీళ్లలోకి సగం వరకు ఇంజన్ మునిగిపోవడంతో వాహనం నిలిచిపోయింది. దీనిని గమనించిన ఇరుగు-పొరుగు వారు పరుగున అక్కడికి చేరుకున్నారు. తాళ్లను కట్టి కూలీలతో సహా వాహనాన్ని బయటికి లాగారు. విషయం తెలుసుకున్న దేవదుర్గ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

నూతన అధ్యక్షుడికి సన్మానం

సిరుగుప్ప, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు ఉచ్చీరప్పకు పూర్వ స్నేహితులు పూలమాలలు వేసి సన్మానించారు. మంగళవారం సిరుగుప్ప పట్టణంలో ఎన్జీవో భవనంలో పూర్వ స్నేహితులు క్రిష్ణమూర్తి, కరీముల్లా శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఉచ్చీరప్ప అధ్యక్షుడిగా ఎన్నికవడంతో స్వీట్లు పంపిణీ చేశారు.

జనతా బజార్ అధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధం

బళ్లారి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బళ్లారి సెంట్రల్ కో-ఆపరేటివ్ హోల్సేల్ స్టోర్ లిమిటెడ్ (జనతా బజార్) అధ్యక్షుడు నీలకంఠప్ప పై అవిశ్వాసానికి సభ్యులు సిద్ధమయ్యారు. మంగళవారం అధికారిని కలిసి 12 మంది సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యక్షుడు నీలకంఠప్ప తన రెండున్నరేళ్ల పదవీ కాలంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అందుకే అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యామన్నారు. కమిటీ ఉపాధ్యక్షురాలుతో పాటు సుమారు 12 మంది సభ్యులు తిరుగుబాటు జెండా ఎగరవేశారు.



వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

లక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

కంప్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): లక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. విజయనగర జిల్లాలోని కూడ్లిగి పట్టణంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాస్ పాల్గొని స్వామి వారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ప్రతి గ్రామాలు, పట్టణాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తిభావం పెంపొందుతుందన్నారు.



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

ఓట్ల లెక్కింపులో నిబంధనలు పాటించాలి

- 22 నుంచి 24 వరకు జిల్లావ్యాప్తంగా నిషేధాజ్ఞలు
- డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా



బళ్లారి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా నిబంధనలు పాటించాలని కలెక్టర్ డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా సూచించారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఈనెల 22 నుంచి 24 వరకు జిల్లా వ్యాప్తంగా నిషేధాజ్ఞలు అమలు ఉంటాయన్నారు. ఓట్ల లెక్కింపు 23న బళ్లారిలోని పాలిటెక్నిక్ కళాశాలలో చేపడ్తామన్నారు. ఓట్లు లెక్కింపు ముందు రోజు నుండి మరుసరి రోజు వరకూ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎక్కడా ప్రజలు గుమిగూడరాదన్నారు. వాహనాల్లో అధిక సంఖ్యతో తరలి వెళ్లరాదని, కౌంటిగ్ కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, సిరంజి బాటిళ్లు, ఇతర ఆయుధాలు లాంటివి వెంట తెచ్చుకోరాదన్నారు. సెల్‌ఫోన్లు కౌంటింగ్ హాల్‌లోకి అనుమతించేది లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుధాకర్

బళ్లారి సిటీ, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మంగళవారం నగరంలోని గాలి రుక్మిణమ్మ చెంగారెడ్డి స్మారక ప్రభుత్వ కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ హాల్లో కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం, బళ్లారి జిల్లా ఆరోగ్య కుటుంబ సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి వ్యసనాలకు లోనుకాకుండా ఆరోగ్యకర జీవితాన్ని గడపాలన్నారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖకు చెందిన శర్మ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల శరీరంపై చాలా తీవ్రమైన దుష్ప్రభావాలు ఉంటాయి. ఆరోగ్యపరమైన ప్రమాదాలు తరచుగా కనిపిస్తాయన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ప్రొఫెసర్ బసవరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ జీవితంలో డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈసందర్భంగా నెహ్రూ యువజన కేంద్రం జిల్లా యువజన అధికారి పత్తార్, ప్రొఫెసర్ సోమశేఖర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ మత్తెగౌడ, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

బళ్లారి సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. మంగళవారం దేశ వ్యాప్త పోరాటంలో భాగంగా అఖిల భారత రైతు కృషి కార్మిక సంఘం (ఏఐకేకేఎంఎస్) రైతు సంస్థ బళ్లారి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించి వివిధ సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. క్వింటాల్ వరికి రూ.3500, మిర్చికి క్వింటాల్‌కు రూ.25వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు హనుమంతప్ప జిల్లా అధ్యక్షుడు గోవింద్, జిల్లా కార్యదర్శి గుర్లల్లి రాజా, జిల్లాసభ్యులు లింగప్ప, బసవరాజ్, ధన్‌రాజ్, మల్లప్ప, మాబుసాబ్, హొన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవరచుకోవాలి: ఎమ్మెల్యే



ఎమ్మెల్యేని సన్మానిస్తున్న కళాశాల బృందం

బళ్లారి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏ సమస్యలు పరిష్కారం కావాలన్నా విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలని హొస్పేట్ ఎమ్మెల్యే గవియప్ప సూచించారు. మంగళవారం హొస్పేట్‌లోని శ్రీమాత డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ కాండ్రా సతీష్, ఎమ్మెల్యే ఇతర సభ్యులు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఏమి జరిగినా విద్యార్థులు మాకెందుకెలే అని నిర్లక్ష్యం వహించరాదని, రాజకీయ నేతలను ప్రశ్నించే ధైర్యం అలవరచుకోవాలన్నారు. చైర్మన్ కాండ్రా సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలో అభివృద్ధి చెందాలని కోరారు. వీరితోపాటు తిమ్మప్ప తదితర కళాశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిండ్రులు హాజరయ్యారు.

కళలను ఆదరించాలి



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

బళ్లారి సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశ సంప్రదాయ కళలను ఆదరించాల్సిన అవసరం ఉందని విశ్రాంత ప్రిన్సిపాల్ హరికుమార్ తెలిపారు. మంగళవారం నూపర్ కళాట్రస్టు ఆధ్వర్యంలో దొడ్డనగౌడ రంగమందిరంలో ఏర్పాటు చేసిన నూపర ఉత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక కాలంలో శాస్త్రీయ కళలు కనుమరుగవుతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా డా.హరికుమార్, సిద్దలింగప్ప, కార్పొరేటర్ సురేఖ మల్లనగౌడ, నాగభూషణం, డా.వీణను సత్కరించారు. నృత్య కళాకారులకు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో న్యాయవాది గిరిజమ్మ, డా. ధ్రువ, అమెరిక వాణి, మాజీ కార్పొరేటర్ మల్లనగౌడ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

సిరుగుప్ప, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. టెక్కలకోట సీఐ సుందరేష తెలిపిన వివరాల మేరకు రెండు రోజుల క్రితం టెక్కలకోట నుంచి సిరుగుప్ప వైపు వెళుతున్న సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో ఆలూరు తాలుకాకు చెందిన హట్టి బెళగల్ వాసి తిమ్మప్ప (35) డీఎల్ గాయపడ్డాడు. యువకుడిని బళ్లారి కేర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు టెక్కల కోట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోసూరు జోన్

ముఖ్యమంత్రి కప్ పోటీల్లో క్రీడాకారుల సత్తా



మంత్రి చక్రపాణితో క్రీడాకారులు

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా ఓరప్పం పంచాయతీ కల్యాణ మండపంలో జరిగిన 71వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో రాష్ట్రస్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీల్లో కృష్ణగిరి జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. విజేతలకు మంత్రి చక్రపాణి ట్రోఫీలు అందచేసి అభినందించారు. 2023-24 సంవత్సరానికి ముఖ్యమంత్రి కప్ కోసం జిల్లా స్థాయి క్రీడాపోటీలు సెప్టెంబరు 10నుంచి 24వరకు జరిగాయి. జిల్లాస్థాయి పోటీల్లో 17,546 మంది క్రీడాకారులు పాల్గొనగా వివిధ విభాగాల్లో 687 మంది గెలుపొందారు. అనంతరం అక్టోబరు 4 నుంచి 24వరకు రాష్ట్రస్థాయి ముఖ్యమంత్రి కప్ కోసం క్రీడా పోటీలు చెన్నై, తిరుచ్చి, మధురై కోయంబత్తూరులలో పురుషులు, మహిళా జట్లు తలపడ్డాయి. కృష్ణగిరి జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని 14 పతకాలు సాధించారు. మొదటి బహుమతికి రూ.లక్ష, రెండో బహుమతి రూ.75వేలు, మూడో బహుమతి రూ.25వేలుగా ఉంది. కృష్ణగిరి జిల్లాకు చెందిన పాఠశాల విద్యార్థుల జూడో పోటీల్లో 1 బంగారు, 2 కాంస్య పతకాలు సాధించగా బాలికలు ఖోఖో, ఫెన్సింగ్ పోటీల్లో రజిత పథకం, బాక్సింగ్ పోటీల్లో, టేబుల్ టెన్నిస్‌లో కాంస్య పథకం సాధించారు. అలాగే కళాశాల విద్యార్థులు జూడో పోటీల్లో 1 బంగారు పతకం, బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు పురుషులు సింగిల్స్‌లో 1 రజత పథకం, డబుల్స్‌లో 1 కాంస్య పతకం సాధించారు. దివ్యాంగ పురుషుల విభాగంలో అథ్లెటిక్స్‌లో బంగారు, టేబుల్ టెన్నిస్ పోటీల్లోనూ గోల్డ్‌మెడల్ సాధించి కృష్ణగిరి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 97 మంది విద్యార్థులు (అథ్లెటిక్స్ 15, ఫుట్‌బాల్ 33, వాలీబాల్ 29, టేక్వాండో 20)లో ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ పొందుతున్నారు. పౌర ఆహార సరఫరాల శాఖ చక్రపాణి మాట్లాడుతూ పాఠశాల, కళాశాల విద్యార్థులే కాకుండా దివ్యాంగులు సైతం సత్తా చాటడం గర్వకారణంగా ఉందన్నారు. ఇతరులలో స్ఫూర్తి కలిగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కమిటీ అధ్యక్షురాలు మణిమేగలై నాగరాజు, జిల్లా ధర్మకర్తల మండలి చైర్మన్ రిజనీసెల్వం, జిల్లా క్రీడాధికారి రాజగోపాల్, శాఖాధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎంపీ గోపీనాథ్‌కు అభినందనలు

హోసూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హోసూరు ఎంపీ గోపీనాథ్ పుట్టినరోజును పురస్కరించుకుని అభిమానులు నగరంలోని కోటమారియమ్మ ఆలయంలో మంగళవారం విశేషపూజలు జరిపించారు. సీతారాంనగర్‌లో 108 అడుగుల కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. సామాజిక కార్యక్రమాల్లో భాగంగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. 50 కిలోల కేక్ కట్ చేసి అందరికీ అందచేశారు. ఈ సందర్భంగా సుమారు వందమందికి స్మార్ట్ రేషన్ కార్డులు అందించారు. ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మనోహరన్, రాష్ట్ర సంస్థ కార్యదర్శి మునిరాజు, నిర్వాహకులు పరమానంద ప్రసాద్ భక్తవత్సలం కోదండరామన్, చిన్న నీలకంఠన్, షైజా అక్బర్, నెర్లికర్, రఘు, వీరమణితోపాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపీని అభినందిస్తున్న దృశ్యం

స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలి: కలెక్టర్



పతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో వ్యక్తిగత ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యతతోపాటు స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సరయు పిలుపునిచ్చారు. వరల్డ్ టాయ్‌లెట్ డేను పురస్కరించుకుని కృష్ణగిరి యూనియన్ తిప్పనపల్లి పంచాయతి దాసిరిపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించేలా అధికారులు, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఆరోగ్యం కోసం పరిశుభ్రంగా ఉంటానని, నేను నా గ్రామాన్ని, నా ఇంటిని, నా తాలూకాన్ని శుభ్రంగా ఉంచుకుంటాటామని, బహిరంగ ప్రదేశాల్లో ఎవ్వరు మూత్ర విజర్జన చేయరాదని ప్రతిజ్ఞ చేయించారు. వ్యక్తిగత మరుగుదొడ్లను వాడాలని, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డయేరియా, కలరా, టైఫాయిడ్, జాండిస్, మొదలైన వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మరుగుదొడ్లు అవసరమన్నారు. బహిరంగ మలవిసర్జన రహిత పంచాయతీగా తీర్చిదిద్దుతామని పాఠశాల బాలబాలికలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శానిటేషన్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి (మౌలిక సదుపాయాలు) మురుగేశన్, జిల్లా అభివృద్ధి అధికారులు శివ ప్రకాశం, చెల్లక్కన్నాల్, జిల్లా కమిషనర్ వళర్మతి, జిల్లా సమన్వయకర్త భువనేశ్వరి, జిల్లా కోఆర్డినేటర్ జయవేల్, విద్యాశాఖాధికారులు శ్రీనివాసన్ పాల్గొన్నారు.

రాజగణపతి ఆలయంలో మేయర్ పూజలు

హోసూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హోసూరు జూజువాడీ ఉప్కార్ రాయల్ గార్డెన్‌లోని రాజగణపతి ఆలయంలో విశేషపూజలు కొనసాగుతున్నాయి. ముస్లిం సంఘం సభ్యులు కళశాన్ని ఊరేగించారు. ఆలయాన్ని ప్రత్యేకంగా ఆలకంరించారు. ఆలయ పాలకవర్గం తరపున ముస్లిం ప్రముఖులను సత్కరించారు. హోసూరు మేయర్ విశిష్ట అతిథిగా హాజరై ఆయనకు ఆలయ కమిటీ అధ్యక్షులు తరపున ప్రత్యేక ఆహ్వానం పలికారు. ఊరేగింపులో ఇస్లామిక్ సొసైటీ తరపున అబ్దుల్ రహమాన్‌పార్టీ అనీష్, అల్లావుద్దీన్, బాబా ఖాదర్ పాల్గొని ఊరేగింపును ఆలయానికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో డీఎంకే జిల్లా కార్యదర్శి వడివేలు, గణేశ్, అన్నాదురై, తదితరులు పాల్గొని తిలకించారు. కార్యక్రమ ఏర్పాట్లను విజయ్ ఆనంద్, వీరరాఘవన్, అన్నామలై, పార్తిబన్, సురేశ్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.



మేయర్ సత్యకు స్వాగతం పలుకుతున్న స్థానికులు